క్లుప్తంగా

ఐటీఐలో అడ్మిషన్లు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ఐటీఐలో ఐదో విడత అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు డీజిల్ మెకానిక్‌లో పేమెంట్ సీట్లు 4 ఉన్నాయన్నారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అడ్మిషన్ ఉంటుందన్నారు. అలాగే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో కూడా అడ్మిషన్లు ఉన్నాయని తెలపారు. ఈనెల 17వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బంద్‌కు మద్దతు ఇవ్వాలి

ఏటూరునాగారం: బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు ఇచ్చిన నేడు(మంగళవారం) బంద్‌ను బీసీ కుల సంఘాలు, మేధావులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని బీసీ సంఘం నాయకుడు సయ్యద్ సర్దార్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంద్ విజయవంతం చేసి బీసీల రిజర్వేషన్ 42శాతాన్ని దక్కించుకోవాలన్నారు.

విద్యార్థి ప్రతిభ



కాటారం: హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆదివారం జాన్సన్ పబ్లికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి టాలెంటోత్సవ్–2025లో మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సాత్విక ప్రతిభ చాటింది. పప్పెట్ షో విభాగంలో సాత్విక విజేతగా నిలిచి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అవార్డు, మెడల్ అందుకుంది. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి 2500 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనగా ఆదర్శ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సాత్విక అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు తెలిపారు. సాత్వికను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు బీఏరావు, అక్బర్, లావణ్య, తల్లిదండ్రులు కోమల, కుమారస్వామిలను ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత ప్రత్యేకంగా అభినందించారు.

కాలం చెల్లిన పల్లిపట్టీల పంపిణీ!



రేగొండ: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా కాలం చెల్లిన సరుకులు సరఫరా అవుతున్నాయి. కొత్తపల్లిగోరి మండలంలోని నిజాంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరా బాలికలకు పల్లిపట్టీ పంపిణీ చేశారు. కాగా సోమవారం ప్యాకెట్ విప్పి చూడగా పల్లి పట్టీ పాడై ఉండడంతో, అది కాలం చెల్లినదిగా గుర్తించారు. పౌష్టికాహారాన్ని అందిస్తూ, ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కాలం చెల్లిన సరుకులు పంపిణీ చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో రేగొండ మండలంలోని రాయపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కాలం చెల్లిన బాలమృతాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే తరుచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు బాహటంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వరికి ఎండాకు తెగులు

- చేతికందే దశలో పంట
- ఆందోళనలో అన్నదాతలు



వెంకటాపురం(కె): వాతావరణంలో వస్తున్న మార్పుతో వరి పంటలకు ఎండాకు తెగులు సోకుతోంది. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉండడంతో ఆకు చివర ఎండిపోయి కింద వరకు విస్తరిస్తోంది. దీంతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో అన్నదాతలు పంటను సాగు చేస్తున్నారు. ఎండాకు తెగులుతో పాటు వరికి దోమపోటు మండల పరిధిలోని నూగూరు, కర్రవానిగుంపు, రాచపల్లి, పాత్రాపురం, ఆలుబాక గ్రామాల్లో వరి పంటపై ప్రభావం చూపుతోందని రైతులు వాపోతున్నారు. అధిక వర్షాలు, గోదావరి వరదతో సతమతమవుతున్న రైతులకు వరి పంటకు ఎండాకు తెగులు దోమ పోటు ఆందోళనకు గురి చేస్తున్నాయి. అధిక వర్షాల కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో వరిపై ప్రభావం చూపుతోన్నాయని రైతులు తెలుపుతున్నారు. వరిలో తెగులు నివారణకు నత్రజని, కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సీఓసీ 100 గ్రాములు, ప్లంటో మైసిన్ 400 గ్రాములు ఎకరాకి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని స్ట్రెపితో మైసిన్, కానిప్లంటో మైపిన్, అగ్రిమైసిన్ 100 లేదా 200 గ్రాములు ఎకరానికి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని తెలుపుతున్నారు.

తెగులు వచ్చింది..



నాలుగు ఎకరాల వరి పంటను సాగు చేశా. వరి పొట్ట దశలో ఉండగా ఎండు తెగులు వచ్చింది. దీంతో పంట దిగుబడి తగ్గి నష్టపోయే అవకాశం ఉంది. వ్యవసాయ అధికారులు పర్యటించి తెగులు నివారణకు సూచనలు సలహాలు ఇవ్వాలి.

– పోతురాజు రైతు, నూగూరు

కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు



వాలీబాల్ క్రీడల్లో తలపడుతున్న జట్లు

ములుగు రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని మండల విద్యాశాఖ అధికారి వజ్జ తిరుపతి అన్నారు. జిల్లాలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 69వ ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. సోమవారం అండర్–14 కబడ్డీ, అండర్ 17 వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడారు. క్రీడాకారులు క్రీడల్లో అత్యుతమ ప్రతిభ కనబరచాలని అన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలని అన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పోటీలలో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలని అన్నారు. గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి బల్లూరి వేణు, గుండబోయిన మల్లయ్య, క్రీడల అధికారి ఆదినారాయణ, రాజు, జగదీశ్, నాగేందర్, సమ్మయ్య, లక్ష్మీనారాయణ, లవనిక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన రాజోజు రామచంద్రా చారి నెలరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో రామచంద్రా చారితో కలిసి పదో తరగతి చదివిన స్నేహితులు ఈ విషయం తెలుసుకొని ఆపదలో మేమున్నాము అంటూ సోమవారం అతడిని ఓదార్చి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40వేల నగదు అందజేసి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. ఆపదలో ఆదుకున్న మిత్రులకు రామచంద్రా చారి ప్రతేక కృతజ్ఞతలు తెలిపారు. అన్న మహేందర్, బుస్స శ్రీనివాస్, ఏదుల మనోహర్, డి.సంజీవ రావు, శంకర్, ఐలి సురేందర్, కోగిల భిక్షపతి, చంద్రమౌళి, బత్తుల వీరభద్రంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అభ్యాస దీపికల అందజేత



స్టడీ మెటీరియల్ ఇస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల జిల్లాపరిషత్ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు తిరుపతి సోమవారం అభ్యాస దీపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పంపిణీ చేసిన అభ్యాస దీపికలతో పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ఉపయోగ పడుతుందన్నారు. ప్రతీ విద్యార్థి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మానస, శర్మ, యాకూబ్ పాషా, ఐత మహేందర్, చంద్రప్రకాశ్, ఓస్ సందీప్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీసులు

ఏటూరునాగారం: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం సమీపంలో 163 జాతీయ రహదారిపై ఎంజే ఫంక్షన్ హాల్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాజేడు నుంచి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గంజాయిని ఏటూరునాగారం గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వాజేడు మండలం సుందరయ్యకాలనీకి చెందిన తన్నూరి భాను ప్రకాశ్, మరో వ్యక్తి ఇదే మండలానికి చెందిన చిడెం సురేందర్‌గా గుర్తించారు. వారు వెంకటాపురం(కె)లోని ముత్తేబోయిన ప్రేమ్‌చందు దగ్గర తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఆ గంజాయిని ఏటూరునాగారంలో ఎక్కువ ధరలకు విక్రయించారని యత్నింస్తున్నారు. నిందితుల నుంచి 330 గ్రాముల గంజాయిని ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకొని పోలీస్ స్టేషన్‌కి వచ్చి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గంజాయి విలువ రూ.13,500 ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సుధాకర్, సదానందం, గోపి, ధ్రువ, మహేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న నాయకులు

మంగపేట: మండలంలోని కోమటిపల్లిలో కుదురు పాక సమ్మక్క, తొండ్యాలలక్ష్మీపురానికి చెందిన వట్టం శ్రీనుదద్ది ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా నాయకుడు మసిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు పరామర్శించి ఒక్కొక్కరికీ రూ.5000 నగదును అందజేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామెర సారయ్య, మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్, నాయకులు బూర్గుల సతీశ్, సీనియర్ నాయకులు మార్పుల దయాకర్‌రెడ్డి, బాలనర్సయ్య, చాంద్‌పాష, సతీశ్, వినోద్, మల్లేశ్, మహేందర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం సరికాదు



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం సరికాదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యాం బాబుమాదిగ అన్నారు. జస్టిస్ గవాయ్‌పై దాడికి కారకులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరుతూ.. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నోముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మడిపల్లి శ్యాం బాబు మాదిగ హాజరై మాట్లాడారు. భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దళితుడైన జస్టిస్ గవాయ్ లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాకేశ్ కిషోర్ అనే వ్యక్తి షూస్ విసిరి దాడికి పాల్పడటం దుర్మార్గ చర్య అన్నారు. దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపై కూలిన కల్వర్టు

- నాలుగు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



బాలన్నగూడెం ప్రధాన రోడ్డుపై కూలిన స్లాబ్ కల్వర్టు

మంగపేట: మండంలోని తిమ్మంపేట నుంచి నీలాద్రిపేటకు వెళ్లే ప్రధాన రోడ్డుపై తిమ్మంపేట బీసీ కాలనీ సమీపంలోని దాముల ఒర్రెపై నిర్మించిన స్లాబ్ కల్వర్టు సోమవారం సాయంత్రం కూలిపోయింది. దీంతో తిమ్మంపేట పంచాయతీ పరిధిలోని అబ్బాయిగూడెం, బాలన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని నీలాద్రిపేట, ప్రాజెక్టునగర్ గొత్తికోయగూడెం నాలుగు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నయంగా మరో మార్గం లేకపోవడంతో పాటు కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. దీంతో కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కల్వర్టు కూలిపోయిన ప్రాంతాన్ని ఎస్సై టీవీఆర్ సూరి పరిశీలించారు. తాత్కాలికంగా మరమ్మతు నిర్వహించే విధంగా సంబంధిత పీఆర్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

తాత్కాలిక మరమ్మతులకు ఏర్పాట్లు

తిమ్మంపేట నుంచి నీలాద్రిపేటకు వెళ్లే ప్రధాన రోడ్డుపై తిమ్మంపేట బీసీ కాలనీ సమీపంలోని దాముల ఒర్రెపై నిర్మించిన స్లాబ్ శిథిలావస్థకు చేరడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటికి కోతకు గురి కావడంతో కూలిపోయినట్లు సమాచారం. మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలోని వివిద గ్రామాల్లోని రోడ్ల మరమ్మతులు, బీటీ రెనివల్ పనులను చేపట్టేందుకు ప్రభుత్వం 2023–2024 ఆర్థిక సంవత్సరంలో రూ 13 కోట్ల నిధులను మంజూరు చేసింది. ప్యాకేజీ పనుల్లో తిమ్మంపేట నుంచి నీలాద్రిపేట వరకు బీటీ రెన్యువల్ పనులకు గాను రూ.2 కోట్లు కేటాయించారు. కాగా కల్వర్టు కూలిన విషయం తెలిసిన వెంటనే పీఆర్ డీఈ నరేష్‌బాబు బీటీ రెన్యువల్ పనులను దక్కించుకున్న గుత్తేదారుతో మాట్లాడి కల్వర్టు కూలిన ప్రదేశంలో తాత్కాలికంగా పైపులు వేసి మరమ్మతలు చేపట్టి రవాణా సౌకర్యం పునరుద్ధరించే విధంగా చర్యలు చేపడుతున్నారు. నేడు(మంగళవారం) మద్యాహ్నం వరకు మరమ్మతు పనులు పూర్తి చేయనున్నట్లు డీఈ తెలిపారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట రైతు బైండోవర్

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లి గ్రామానికి చెందిన రైతు ముల్కల్ల బాపును సోమవారం తహసీల్దార్ నాగరాజు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ధన్వాడ, గుమ్మాళ్లపల్లి మధ్యగల తన వరి పొలం వద్ద విద్యుత్ ఉచ్చులు పెడుతున్నారనే సమాచారంతో ముందస్తు చర్యగా బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి విద్యుత్ తీగలతో ఉచ్చులు పెడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. ప్రజలు విద్యుత్ ఉచ్చుల సమాచారాన్ని పోలీస్, అటవీ, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

చిట్యాల: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణ అన్నారు. సోమవారం సమాచార హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా మండలంలోని జూకల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు మమత ఇంగ్లీశ్ చేతిరాత పోటీలు నిర్వహించారు. దీంతో పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు తన సొంత ఖర్చుతో రూ.5,500 విలువైన డిక్షనరీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితతోనే దేశాభివృద్ధి

- ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సరస్వతి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

భూపాలపల్లి రూరల్: సమాజంలో మహిళా సాధికారత ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమని సమాజంలో నెలకొన్న లింగ వివక్షతను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సరస్వతి అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గొర్లవీడు ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ రీజినల్ డైరెక్టర్ సరస్వతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికల హక్కులను అందరికీ తెలిసేలా చైతన్యం పరిచే బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. బాలిక హక్కులను భంగపరిచేలా ఎవరైనా ప్రవర్తిస్తే వాటిని కాపాడేందుకు ఉన్న చట్టాలను కూడా బాలికలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో సోషల్ మీడియా ప్రభావం వల్ల విద్యార్థులు చెడిపోయే ప్రమాదం ఉన్నందున వారికి ఏది మంచో ఏది చెడు తెలుసుకునేలా విచక్షణ జ్ఞానాన్ని పెంపొందించాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి గ్రామ కూడలిలో బాలికా సాధికారికత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ సామల రమేశ్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లక్ష్మణ్, ఏరియా మేనేజర్ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మల్లేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుభాకర్‌రెడ్డి, జయప్రకాశ్, వంశీ, కుమారస్వామి, శంకర్రావు, రమాదేవి, సుధాకర్, మాలతి, మేనక, వాసుదేవ్, నవనీత్, రియాజ్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ముగ్గురు పిల్లలు ఉన్న వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ.. భూపాలపల్లి జిల్లాలోని పలువురు నాయకులు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 16న నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించాలన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిరిపురం కుమారస్వామి, నందునాయక్, కమ్మ శ్రీనివాస్, కొమురయ్య, సంపత్, స్వామి, తదితరులు ఉన్నారు.

అబ్జర్వర్ అబ్రహంను కలిసిన మంత్రి, ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆల్‌ఇండియా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ జాన్సన్ అబ్రహంను సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

వర్షాలతో రైతు విలవిల

- దెబ్బతింటున్న పంటలు
- ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు



వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట

చిట్యాల: అన్నదాతకు ఈ సంవత్సరం కాలం కలసి రాలేదు. ఆరుగాలం కష్టపడి పత్తి, మిర్చి, వరి పంటలు పండించగా చేతికందే సమయంలో వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. పంట వేసినప్పటి నుంచి కాపాడుకుంటూ వచ్చిన చివరికి వర్షాలతో చేతికందడం లేదని రైతులు వాపోతున్నారు. కూలీలకు, పరుగుల మందలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని తెలుపుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది. భూములను కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలు వేస్తే భారీ వర్షాలకు వేసిన పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదు. దినికి తోడు పంటలకు గిట్టుబాటు ధరలు సక్రమంగా లేక రైతులు అల్లాడుతున్నారు. పెట్టిన పెట్టుబడి వచ్చేవి ధంగా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అప్పులపాలవుతున్నామని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఐదు ఎకరాల్లో పత్తి పంట వేశా. ఎకరానికి రూ.25వేలు పైగా పెట్టుబడి పెట్టాను. ఈ సంవత్సరం పంటలకు పెట్టిన పెట్టుబడి వచ్చే విధంగా లేదు. వ్యవసాయం మీదనే అధారపడి ఉన్నా. భారీ వర్షాల కారణంగా చేతికచ్చే సమయంలోనే పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– వీరస్వామి, రైతు, రాంచంద్రాపూర్

‘సిరికొండ’ జన్మదిన వేడుకలు



టేకుమట్ల: కేక్ కట్ చేస్తున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తొలి శాసన సభాపతి, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సిరికొండ మధుసూదనచారి కృషితోనే భూపాలపల్లి జిల్లా ఏర్పాటు అయిందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్